

టెక్నోజియాన్-24 షురూ..

వరంగల్ నిట్ ఆడిటోరియంలో శుక్రవారం టెక్నోజియాన్-24 వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 50కిపైగా ఈవెంట్స్‌తో విద్యార్థులు సందడి చేయనున్నారు. - 8లో▸



ఇక తెలుగులోనే..

విద్యుత్ వినియోగదారులు, రైతులకు విద్యుత్ సమాచారం సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగులోనే అందించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.2° /17.5°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 18 సంవత్సరాలు నిండిన వారు..అలాగే 2025 జనవరి 1నాటికి నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 9,10 తేదీల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు బూత్‌స్థాయి అధికారులు ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దవంగర: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ గణేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మహేందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణమేకొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తూకం వేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లస్కర్, సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణం

మహబూబాబాద్: పశు సంపద కలిగిన ప్రతీ రైతు రూ.1,60,000 వరకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు నుంచి రుణం పొందవచ్చని జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి ఉండాల్సిన అవసరం లేదని, పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులై ఉండాలన్నారు. రూ.3లక్షల వరకు వ్యవసాయ రుణం పొందవచ్చన్నారు. సాధారణ వడ్డీ 7శాతం ఉంటుందన్నారు. బ్యాంకు నిర్దేశించిన కాలంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. దానికి సంబంధించిన దరఖాస్తు ఫారం పశువైద్యుడి దగ్గర అందుబాటులో ఉంటుందని తెలిపారు. పెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శాశ్వత ప్రాతిపదికన స్టెనో, టైపిస్టు, రికార్డు అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కోర్టు అధికారులు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 14న నియామక పరీక్ష నిర్వహిస్తారని, వివరాలకు కోర్టు వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు

నెహ్రూసెంటర్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు, మాలధారుల సౌకర్యార్థం మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను డిపాజిట్ లేకుండా అద్దెకు ఇవ్వనున్నట్లు మేనేజర్ ఎం.శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. శబరిమలకు బస్సు బుక్ చేసుకున్న భక్తులకు కేరళ రాష్ట్రంలో స్వామి దర్శనం కోసం ప్రత్యేక వలంటీర్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులో ప్రయాణించే గురుస్వామితో పాటు ఒక అటెండర్, ఇద్దరు వంట మనుషులు, ఇద్దరు మణికంఠ స్వాములకు ఉచిత ప్రయాణ వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. 30 మంది భక్తులు ఉన్నట్లయితే తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని డీఎం తెలిపారు. ఆర్టీసీ అందిస్తున్న ఈ సదావకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలి

విద్యారణ్యపురి: కామన్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో హనుమకొండ, హసన్‌పర్తి, శాయంపేట, ఐనవోలు, కాజీపేట మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కులగణన పేరుతో ప్రాథమిక పాఠశాలలకు ఒక పూట సెలవు ప్రకటించడం సరికాదన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్, జిల్లా అధ్యక్షుడు ఎం.రఘుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి అన్నారెడ్డి, బాధ్యులు రామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పిట్టవాలని చెట్టు..

- పర్యావరణానికి హాని తలపెడుతున్న కోనో కార్పస్ చెట్లు
- తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం



తొర్రూరు పట్టణంలో డివైడర్ మధ్య ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

తొర్రూరు: పట్టణ సుందరీకరణ కోసం జిల్లాలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో నాటిన కోనోకార్పస్ మొక్కలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం.. హరితహారం కార్యక్రమంలో భాగంగా వాటిని నాటారు. అయితే పర్యావరణానికి ఇవి హాని తలపెడతాయని వృక్షశాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించారు. పట్టణాల్లోని డివైడర్ల మధ్య నిటారుగా, ఏపుగా పెరిగి దుష్ప్రభావాలను వెదజల్లుతూ పరిసరాల్లోని చిన్నచిన్న జీవరాశుల్ని అంతం చేస్తున్నాయని గుర్తించారు.

మొక్కకు రూ.50 వెచ్చించారు...

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఈ మొక్కలు నాటారు. కోనోకార్పస్ చెట్లు పర్యావరణానికి హాని కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నా పెడచెవిన పెట్టారు. జిల్లాలోని 18 మండలాల్లోని 487 పంచాయతీలు, 4 మున్సిపాలిటీల పరిధిలో సుమారు 3 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. పంచాయతీల స్థాయిని బట్టి 250 నుంచి 500 వరకు, మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో, మిగతావి ఖాళీ స్థలాల్లో నాటారు. ఒక్కో మొక్కకు రూ.50 వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ చొప్పున సుమారు జిల్లాలో రూ.1.50 కోట్లకు పైగా వెచ్చించినట్లు తెలుస్తుండగా, ఆ మేరకు ప్రజాధనం వృథాగా మారింది.

వారాల వ్యవధిలోనే ఏపుగా..

తక్కువ కాలంలో ఏపుగా పెరగడం, వేర్లు లోతకు పాతుకుపోవడంతో చెట్లు ప్రతీ రుతువులోనూ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా నాటడం వల్ల పరిసరాలు పచ్చదనంతో నిండిపోతున్నాయి. వారాల వ్యవధిలోనే ఏపుగా పెరుగుతుండటంతో ఈ మొక్కకు ప్రాధాన్యత వచ్చింది.

అలర్జీ మొదలుకుని..

కోనోకార్పస్ చెట్ల నుంచి వెలువడే పుప్పొడివల్ల అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా సమస్యలు వస్తున్నాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. ఈ చెట్ల వల్ల పక్షులు, కీటకాలకు ఎలాంటి ఉపయోగం లేదని గుర్తించారు. సీతాకోక చిలుకలు సైతం వీటి పుప్పొడిని ఆశించవు. పక్షులు గూళ్లు కట్టవు.. ఏ జంతువు దీని ఆకులను తినదు. పర్యావరణ వ్యవస్థలో ఈ మొక్కతో ఎలాంటి ఉపయోగం లేకపోగా దుష్ప్రభావాలు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని మున్సిపాలిటీలు, గ్రామాల్లో పెంచడం వల్ల వేర్లు లోతుకు పాతుకుపోయి అడ్డువచ్చే నీటి పైపులు, కేబుళ్లను, మురుగు కాల్వల నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నట్లు గుర్తించారు. మరిపెడ మున్సిపాలిటీలో ఈ చెట్లను తొలగించారు. మిగతా మున్సిపాలిటీల్లో తొలగింపు ప్రక్రియ జరగలేదు. గ్రామాలో చెట్లు ఏపుగా పెరిగాయి. అక్కడా తొలగింపు చర్యలు లేవు.

చెట్లను తొలగించాలి



ప్రాణాంతక కోనోకార్పస్ చెట్లు వ్యాపార సముదాయాల ఎదుట, డివైడర్ల మధ్యలో ఉండటం మంచిది కాదు. ఆస్తమా, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ఇలాంటి చెట్లను వెంటనే తొలగించాలి.

-దొనికెన కుమారస్వామి, సామాజిక కార్యకర్త, తొర్రూరు

మొక్కలు నాటడం నిలిపివేశాం



కోనోకార్పస్ మొక్కలు గతంలో నాటాం. ప్రస్తుతం ఆ మొక్కలను ఎక్కడా నాటడం లేదు. తొర్రూరు పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఈ మొక్కలు గతంలో నాటాం. ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటి స్థానంలో వేరే మొక్కలు నాటేందుకు కృషి చేస్తాం.

-శాంతికుమార్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

గూడూరు: ప్రజల్లో ఫ్రెండ్లీ పోలీసు భావన కలిగిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా ఎస్పీ పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణాలను ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో జరిగిన పలు రకాల నేరాలకు సంబంధించిన వివరాలు, శిక్ష లుపడిన, పెండింగ్‌లో ఉన్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, సిబ్బంది పనితీరుపై సీఐ కె.బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే వారికి సత్వర సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. మండలంలోని పలు రకాల కేసుల్లో నిందితులు, రౌడీ షీటర్లపై ఎప్పటికప్పుడు వాకబ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడ ఎస్సై కుషకుమార్, గంగారం ఎస్సై రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న సెక్రటరీ నిరంజన్

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ఖమ్మం, వరంగల్ జాతీయ రాహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ జిల్లాలను కలిపే ప్రధాన మార్గం కావడంతో వ్యవసాయ అధికారులు మండల కేంద్రంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కాగా పత్తి, ధాన్యం, వివిధ పంటలతో ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి రుసుము వసూలు చేసి ప్రభుత్వ ఖాజానాకు పంపాలి. కానీ ఇక్కడ విధులు నిర్వర్తించే ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలను తంగలో తొక్కి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది గమనించిన గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తొర్రూరు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ నిరంజన్ వాహనాలను పరిశీలించి రుసుము వసూలు చేశారు. వాహనాలను తనిఖీ చేసే క్రమంలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. చెక్ పోస్టును మండల కేంద్రం శివారులో ఏర్పాటు చేసి రుసుము వసూలు చేస్తే బాగుంటుందని సూచించారు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- కేసముద్రం మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం



సీసీఐ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేశారన్నారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధరను అందించేందుకు సీసీఐ కొనుగోళ్లను ప్రభుత్వం చేపడుతుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారు వెంకన్న, కదిర సురేందర్, బండారు దయాకర్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, రావుల మురళి, వోలం రమేష్, ఎండి.అయూబ్‌ఖాన్, చిదురాల వసంతరావు, సంకెపల్లి నారాయణరెడ్డి, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, సమ్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

- జడ్జిలు సురేష్, తిరుపతి



ర్యాలీలో మాట్లాడుతున్న జడ్జిలు సురేష్, తిరుపతి

మహబూబాబాద్ రూరల్: కక్షిదారులు న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు నుంచి కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్, నెహ్రూ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు సురేష్, తిరుపతి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా జైళ్లలో మగ్గుతున్న అనేకమంది ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించి ఆదుకుంటున్నామన్నారు. జాతీయస్థాయిలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహించి కేసులను పరిష్కరించి ముద్దాయిలకు విముక్తి కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ న్యాయవాది దేశబోయిన వెంకటస్వామి, సీనియర్ న్యాయవాది కొంపెల్లి వెంకటయ్య, మహబూబాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

- తొర్రూరు జడ్జి సరిత



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జడ్జి సరిత

తొర్రూరు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. అన్యాయాలు, అక్రమాలు, అరాచకాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు రాజ్యాంగం అనేక హక్కులు, రక్షణలు కల్పించిందన్నారు. బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బాలికలు అత్యవసర సాయం కోసం 1098కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే సాయం అందుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాలు సాధించాలన్నారు. చదువులో రాణిస్తున్న పలువురు విద్యార్థినులకు జడ్జి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి బి.శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని డీఈఓ రాజేశ్వర్ అన్నారు, జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం డీఈఓ రాజేశ్వర్ వంట, తరగతి గదులు, పరీక్ష పత్రాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పదో తరగతి సిలబస్ పూర్తి చేసి ఉదయం, సాయంత్రం విద్యార్థినులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, ఉపాధ్యాయులు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహించి, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయకుమారి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి

- కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- నేటి నుంచి వివరాల సేకరణ
- జిల్లాలో 2,45,953 కుటుంబాలు



స్టిక్కర్లు అంటిస్తున్న ఎన్యుమరేటర్లు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఈ నెల 6న ప్రారంభించింది. ఈమేరకు మొదటి విడతలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ స్టిక్కరింగ్ ప్రక్రియను చేపట్టారు. కాగా జిల్లాలో శుక్రవారం ఈ కార్యక్రమం ముగిసినట్లు అధికారులు తెలిపారు. నేటి(శనివారం) నుంచి సర్వే వివరాలు సేకరించి నమోదు చేస్తారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది ప్రతీరోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వే చేస్తారు. సెలవురోజు ఉదయం నుంచి సాయత్రం వరకు వివరాలు సేకరిస్తారు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయనున్నారు. అధికారులు, ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ఆయా కుటుంబాలకు చెందిన వారు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి.

2,45,953 కుటుంబాలు..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 461 గ్రామ పంచాయతీల్లో 2,45,953 కుటుంబాలు ఉన్నాయి. నేటి నుంచి ఈనెల 22వరకు సర్వే చేపడుతారు. కాగా, ఇంట్లో ఎంత మంది ఉంటారు, ఏం చేస్తారు, కులం, ఉపకులం, భూమి, సంపాదన, గొర్రెలు, మేకలు, గేదెలు, అప్పులు, ఆదాయం, రాజకీయ పోస్టుల్లో ఉన్నారా.. ఏమైనా పదవుల్లో పనిచేశారా.. ఉద్యోగాలు ఉన్నాయా.. ఇలా తదితర ప్రశ్నలకు సమాధానాలు సేకరించి వివరాలను ఫామ్‌లో నమోదు చేస్తారు. పార్ట్-ఏలో యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలు, పార్ట్-బీలో కుటుంబ వివరాలకు సంబంధించి 17ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 75 ప్రశ్నలతో కూడిన ఎనిమిది పేజీల సర్వే పత్రాన్ని ఇంటి యజమానులు ఇచ్చిన సమాచారం మేరకు పూరించనున్నారు. సమాచారం పూర్తిగా కచ్చితత్వంతో ఉండాలని, తప్పులు, అబద్ధాలు చెప్పొద్దని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలతో నేరాల అదుపు

- అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

నెహ్రూసెంటర్: ప్రజలు జాగ్రత్తలతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో షీటీం, భరోసా, సైబర్‌క్రైమ్‌పై శుక్రవారం వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు, అఘాయిత్యాలను అదుపు చేయడంలో విద్యార్థుల ప్రాత కీలకమన్నారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉంటూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలని, ఫేక్‌బుక్, ఇన్‌స్టాగామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ సీఐ దేవేందర్, డీసీఆర్‌బీ సీఐ సత్యనారాయణ, షీటీం ఎస్సై సునంద, సిబ్బంది, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

నెహ్రూసెంటర్: వైద్యారోగ్యశాఖ ఎన్‌హెచ్‌ఎం పరిధిలో ఇటీవల జరిగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను మహబూబాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈ నెల 11న మధ్యాహ్నం 12 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వాయిదా పడిన మిగిలిన పోస్టులను 1.3 రేషియోలో భర్తీ చేసేందుకు త్వరలోనే సమాచారం అందిస్తామని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల అవస్థలు

- పెండింగ్‌లో పలు రకాల బిల్లులు
- విడుదల చేయాలని వేడుకోలు



మహబూబాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రీస్కూల్ విధానం (పూర్వ ప్రాథమిక విద్య) అమల్లోకి తీసుకొచ్చింది. కాగా, కేంద్రాల నిర్వహణకు సంబంధించి పలు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి గ్యాస్, ఇతర వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

1,437 కేంద్రాలు

మరిపెడ, డోర్నకల్, గూడూరు, తొర్రూరు, మానుకోటలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఏడు నెలలలోపు పిల్లలు 4,000మంది, ఏడు నెలల నుంచి ఏడాది వయస్సు గల పిల్లలు 4,009మంది, ఏడాది నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలు 15,928మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు వయసు గల పిల్లలు 15,968మంది ఉన్నారు. గర్భిణులు 4,014, బాలింతలు 3,985మంది ఉన్నారని అధికారులు తెలిపారు. కాగా 335 కేంద్రాలు సొంత భవనాల్లో, 646 కేంద్రాలు అద్దె లేకుండా, 456 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేంద్రాల బలోపేతం కోసం ఈఏడాది ఆగస్టు 1వతేదీ నుంచి ప్రభుత్వం ప్రీస్కూల్ విధానాన్ని అమలు చేస్తోంది.

బిల్లులు పెండింగ్‌లో..

గ్యాస్ బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండగా ఇటీవల రెండు నెలల బిల్లులు వచ్చాయని టీచర్లు చెబుతున్నారు. 12 నెలల ఇంటి అద్దెలు బిల్లులు పెండింగ్ ఉండగా ఇటీవల రెండు నెలలవి మాత్రమే వచ్చాయని తెలిపారు. కూరగాయల బిల్లులు రెండు సంవత్సరాలుగా రావడం లేదని దీంతో అప్పు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో బిల్లులపై స్పష్టత ఇవ్వడం లేదని, వెంటనే బిల్లులు విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్లు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా అధికారులు మాత్రం బిల్లులు పెండింగ్‌లో లేవని చెబుతున్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: మానుకోటలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ సభ్యత్వ నమోదులో మానుకోట జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. త్వరలోనే ఉద్యమాల చేసి ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజలకు లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శశివర్ధన్ రెడ్డి, జిల్లా సభ్యత్వ ప్రభారి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, సభ్యత్వ నమోదు కో కన్వీనర్ ఇందుభారతి, నాయకులు నరసింహారెడ్డి, ఆకుల శ్రీనివాస్, భరత్, గణేష్, లక్ష్మణ్, నాగరాజు, దేవా, లింగం, భవాని ప్రసాద్, మరాగని రాజు, మల్లేష్, మాచర్ల నవీన్, వెంకన్న, సత్యనారాయణ, భాస్కర్, సుధాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా షమిత



షమితకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్‌ క్వాలిటీ అస్యూరెన్స్‌ సెల్‌(ఐక్యూఏసీ) డైరెక్టర్‌గా జువాలజీ విభాగం ఆచార్యులు షమిత నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ సెల్‌ డైరెక్టర్‌గా కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ఆచార్యులు నర్సింహారావు బాధ్యతలను నిర్వర్తిస్తుండగా ఆయన స్థానంలో షమితను నియమించారు. ప్రస్తుతం జువాలజీ విభాగం అధిపతిగా, కేయూ లైబ్రరీ మెంబర్‌ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న షమిత జువాలజీ విభాగం బోర్డు ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్‌గా, కేయూ అకాడమిక్‌ ఆడిట్‌ డీన్‌గానూ వ్యవహరించారు. కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం షమితకు నియామక ఉత్తర్వులు అందజేశారు. షమిత.. ఆచార్యులు నర్సింహాచారి నుంచి బాధ్యతలను స్వీకరించారు.

బైక్‌ను ఢీ కొన్న బొలెరో..

● ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



గుర్రం సంజయ్‌ (ఫైల్‌)



తీవ్రంగా గాయపడిన కప్పల బన్ని

గూడూరు: బొలెరో వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని మానుకోట వైపు జాతీయరహదారిలోని విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన గుర్రం సంజయ్‌(18), మట్టివాడకు చెందిన కప్పల బన్ని ఇద్దరు స్నేహితులు డిగ్రీ చదువుతున్నారు. రాత్రి 10 గంటల తర్వాత గూడూరులో కలుసుకున్న ఇద్దరు మిత్రులు ఒకే బైక్‌పై తమ గ్రామాలకు బయలుదేరి విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో ఎదురుగా మానుకోట నుంచి ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేసి దూసుకొచ్చిన బొలెరో వాహనం యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో గుర్రం సంజయ్‌ తల, ఛాతి, ఇతర ప్రదేశాల్లో తీవ్రగాయాలై రక్తస్రావంలో పడిపోగా, కప్పల బన్నికి ఎడమ చేయి రెండు చోట్ల విరిగి, తలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు చేరుకొని గాయపడిన వారిని నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. గుర్రం సంజయ్‌ మార్గమధ్యలో మృతిచెందాడు. కప్పల బన్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

టెక్నోజియాన్‌- 24 షురూ..



టెక్నోజియాన్‌లో విద్యార్థిని సందడి

నృత్యం చేస్తున్న విద్యార్థిని



హాజరైన విద్యార్థులు



గేమ్‌ ఆడుతున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఎన్వీ.చౌదరి



నిట్‌ క్యాంపస్‌లో విద్యార్థినులు

ప్రారంభించిన సీఎస్‌ఆర్‌ -ఐఐసీటీ సైంటిస్ట్‌ ఎన్వీ.చౌదరి

● సమాజానికి సాంకేతిక విజ్ఞానం తోడ్పడాలని పిలుపు

● 50కి పైగా ఈవెంట్స్‌

● నేడు, రేపు కొనసాగనున్న టెక్నోఫెస్ట్‌

కాజీపేట అర్బన్‌: నిట్‌ వరంగల్‌లోని అంబేడ్కర్‌ లర్నింగ్‌ సెంటర్‌ ఆడిటోరియంలో నిర్వహించనున్న మూడు రోజుల టెక్నోజియాన్‌- 24 వేడుకలను సీఎస్‌ఆర్‌-ఐఐసీటీ హైదరాబాద్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ ఎన్వీ.చౌదరి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విజ్ఞానం మెరుగైన సమాజ నిర్మాణానికి నూతన ఒరవడులను సృష్టించేందుకు తోడ్పడాలని అన్నారు. నిట్‌ వరంగల్‌లో ఇంజనీరింగ్‌ విద్యలో చోటు చేసుకుంటున్న మార్పులపై విద్యార్థులు పరస్పరం విజ్ఞానాన్ని పంచుకునే వేదికగా టెక్నోజియాన్‌-24 నిలవాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్‌ వెల్ఫేర్‌ డీన్‌ ఇషాన్‌, బి.శ్రీనివాస్‌, డాక్టర్‌ మురళీధర్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నోజియాన్‌ పేరునే థీంగా..

నిట్‌ వరంగల్‌లో ప్రతి ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించే టెక్నోజియాన్‌ సాంకేతిక మహోత్సవానికి ప్రతి ఏడాది ఏదో ఒక థీమ్‌తో నిర్వహించడం ఆనవాయితీ. కాగా.. టెక్నోజియాన్‌-24ను టెక్నోజియాన్‌ పేరునే థీమ్‌గా కొనసాగిస్తున్నట్లు టెక్నోజియాన్‌ టీం విద్యార్థులు తెలిపారు. టెక్నో అంటే టెక్నాలజీ అని.. జియాన్‌ అంటే వాగ్దానం చేసిన భూమి అని దీనినే ప్రతి ఏడాది కొనసాగిస్తామని టెక్నోఫెస్ట్‌ ప్రారంభోత్సవం సందర్భంగా తెలిపారు. కాగా టెక్నోజియాన్‌-24 ప్రారంభోత్సవంలో భాగంగా విద్యార్థులు అంబేడ్కర్‌ లర్నింగ్‌ సెంటర్‌ ఆడిటోరియం ఎదురుగా శుక్రవారం టగ్‌ ఆఫ్‌ బాల్‌ పేరిట నువ్వా నేనా అంటూ సరదాగా పోటీ పడ్డారు.

నేడు టెక్నోజియాన్‌లో ఇలా...

ఈ ఏడాది 50 కిపైగా ఈవెంట్స్‌తో టెక్నోజియాన్‌ -24 సందడి చేయనుంది. టెక్నోజియాన్‌-24 శనివారం రెండో రోజు మ్యాథమెటికల్‌ సొసైటీ ఆధ్వర్యంలో డేటా సైన్స్‌ క్వెస్ట్‌, ఫొటోగ్రఫీ క్లబ్‌ ఆధ్వర్యంలో రీక్రియేటింగ్‌ ది మూమెంట్‌, క్విజ్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో కేబీసీ, మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్యూచర్‌ మేనేజర్‌, మెకానికల్‌ సొసైటీ ఆధ్వర్యంలో వెహికిల్‌ షో, ఐడియాథాన్‌లతోపాటు మ్యాథ్స్‌ స్కొలర్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ గజేంద్రప్రరోహిత్‌, రిటైర్డ్‌ ఐఏఎస్‌ డాక్టర్‌ తనూజైన్‌ గెస్ట్‌ లెక్చర్స్‌తో కొనసాగనున్నాయి.

పట్టాలు తప్పిన గూడ్స్‌ రైలు



డోర్నకల్‌: పట్టాలు తప్పిన బోగీలను పరిశీలిస్తున్న ఆర్‌పీఎఫ్‌ అధికారులు



డోర్నకల్‌: మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

● డోర్నకల్‌ రైల్వేజంక్షన్‌ పరిధిలో ఘటన

డోర్నకల్‌: మానుకోట జిల్లా డోర్నకల్‌ రైల్వే జంక్షన్‌ పరిధిలోని బైపాస్‌ రోడ్డులో శుక్రవారం గూడ్స్‌ రైలు పట్టాలు తప్పింది. విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు వైపు వెళ్తున్న గూడ్స్‌ రైలు డోర్నకల్‌ జంక్షన్‌ మెయిన్‌ లైన్‌ నుంచి బైపాస్‌ లైన్‌ మార్గంలో భద్రాచలం రోడ్‌ వైపు వెళ్తుండగా బైపాస్‌ మార్గంలో రైలు 17, 18, 19వ బోగీలు పట్టాలు తప్పాయి. బోగీలు ఖాళీగా ఉండడంతో మూడింటిలో ఒకటి పట్టాలకు అడ్డంగా నిలువగా రెండు బోగీలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకున్న స్టేషన్‌ సూపరింటెండెంట్‌ శోభన్‌ప్రసాద్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పట్టాలు తప్పిన బోగీలను ట్రాక్‌పైకి తెచ్చే చర్యలు చేపట్టారు. బైపాస్‌ రోడ్డులో ప్రమాదం జరగడంతో విజయవాడ-వరంగల్‌, డోర్నకల్‌- భద్రాచలం మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

ఏఆర్టీ ట్రైన్‌ సిబ్బంది సహకారం

కాజీపేట రూరల్‌: డోర్నకల్‌ రైల్వే స్టేషన్‌ బైపాస్‌ సైడింగ్‌లో పట్టాలు తప్పిన గూడ్స్‌ వ్యాగన్లను యథాస్థితికి తీసుకొచ్చేందుకు కాజీపేట జంక్షన్‌ నుంచి శుక్రవారం రాత్రి యాక్సిడెంట్‌ రిలీఫ్‌ట్రైన్‌ (ఏఆర్టీ) ప్రత్యేక రైలు సిబ్బంది తరలివెళ్లారు. వ్యాగన్‌లు పట్టాలు తప్పిన సమాచారాన్ని కాజీపేట రైల్వే అధికారులు ఎలక్ట్రిటిక్‌ ఎమర్జెన్సీ సైరన్‌ మోతలతో కాజీపేటలోని ఎమర్జెన్సీ బ్రేక్‌ డౌన్‌ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

రేపు ఉమ్మడి వరంగల్‌ జిల్లాస్థాయి చెస్‌ పోటీలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: వరంగల్‌ జిల్లా చెస్‌ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి అండర్‌-13 చెస్‌ పోటీలను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్‌ నిర్వహణ కార్యదర్శి కన్నా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 01, 2011, ఆ తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. తెలంగాణ చెస్‌ అసోసియేషన్‌ సహకారంతో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి, గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టినరోజు సర్టిఫికెట్‌, చెస్‌బోర్డుతో శనివారం సాయంత్రం 7గంటల వరకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోననంబర్‌ 90595 22986 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

మరమ్మతులు మరింత సులభం!

● రన్నింగ్‌, వ్యాగన్ల రిపేర్‌ కోసం షెడ్‌ నిర్మాణం

● నిర్వహణ కోసం ట్రాక్‌ల ఏర్పాటు



నిర్మాణంలో ఉన్న గూడ్స్‌ సిక్‌లైన్‌ షెడ్డు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌ పరిధి బోడగుట్ట సమీపంలో బ్రేక్‌డౌన్‌ కార్యాలయం వెనకాల రైల్వే అధికారులు కొత్తగా రైల్వే గూడ్స్‌ సిక్‌లైన్‌ షెడ్డును నిర్మిస్తున్నారు. కాజీపేట జంక్షన్‌ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే గూడ్స్‌ రైళ్లకు మరమ్మతులు, మెయింటనెన్స్‌ కోసం ఈ గూడ్స్‌షెడ్డును నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గూడ్స్‌ షెడ్డుతో పాటు గూడ్స్‌ రైళ్ల నిర్వాహణ కోసం కొత్తగా నాలుగు ట్రాక్‌లను కూడా నిర్మిస్తున్నారు. కాజీపేట, వరంగల్‌ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే గూడ్స్‌ ట్రైన్లు రన్నింగ్‌లో ఏమైనా మరమ్మతుకు వచ్చినా, మెకానిక్‌ సమస్య ఉన్నా.. వాటిని గుర్తించి కాజీపేటలో నిర్మించనున్న గూడ్స్‌షెడ్‌కు తరలించి ఆ వ్యాగన్లను తనిఖీ చేసి మరమ్మతు చేసి యథావిధిగా పంపిస్తారు. ఈ షెడ్డు నిర్మాణంతో గూడ్స్‌ రైళ్లు కాజీపేట రైల్వే స్టేషన్‌ మీదుగా వెళ్లకుండా యార్డు మీదుగా ఆయా ప్రాంతాలకు పంపించేందుకు అన్ని విధాలా ప్లాన్‌ చేస్తున్నారు. దీంతో ప్యాసింజర్‌, ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల ట్రాఫిక్‌, గూడ్స్‌ వ్యాగన్ల ట్రాఫిక్‌ సమస్య భవిష్యత్‌లో కాజీపేట జంక్షన్‌లో ఉండదని ఏయే రైళ్లకు కేటాయించిన ట్రాక్‌ రూట్లలో ఆయా రైళ్లు ప్రయాణిస్తాయి. ప్రస్తుతం నాలుగు సిక్‌లైన్లు, నాలుగు మార్షలింగ్‌ లైన్లు, తొమ్మిది గూడ్స్‌ లైన్లు ఉన్నాయని, గూడ్స్‌ రైళ్ల కోసం మరికొన్ని లైన్లు నిర్మించే అవకాశం ఉంది. అన్ని లైన్ల నిర్మాణంతో కాజీపేట రైల్వే యార్డు బిజీ సెంటర్‌గా మారనుంది. త్వరలో గూడ్స్‌ సిక్‌లైన్‌ షెడ్డును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలం మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు

నెల్లికుదురు: అవమాన భారంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మునిగలవీడుకు చెందిన దేశబోయిన శ్రీశైలం (42).. అదే గ్రామానికి చెందిన నాగబోయిన బాలరాజు భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో ఈనెల 7న (గురువారం) బాలరాజు అతని కుటుంబ సభ్యులు.. శ్రీశైలం ఇంటికి వచ్చి గొడవ చేశారు. శ్రీశైలంపై చెప్పులతో దాడి చేసి నువ్వు చనిపోవాలని లేకుంటే మేమే చంపుతామంటూ బెదిరించారు. దీంతో బాలరాజు అతని కుటుంబ సభ్యుల దాడిని అవమానభారంగా భావించిన శ్రీశైలం అదేరోజు రాత్రి పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య దేశబోయిన సునీత ఫిర్యాదు మేరకు బాలరాజుతోపాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మనస్తాపంతో ఇంటర్‌ విద్యార్థి..

● జన్మదినం ముందురోజే అఘాయిత్యం



సాయికిరణ్‌ (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌: తాను చదువుతున్న కళాశాల నుంచి మార్చమని కోరగా తల్లిదండ్రులు వద్దని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఇంటర్‌ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలంలోని ఛాగల్లుకు చెందిన వేణుగోపాల్‌, సుకన్య కుమారుడైన సాయికిరణ్‌ హనుమకొండలోని ఓ ప్రైవేట్ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో దీపావళి పండుగ సెలవులకు ఇటీవల ఛాగల్లుకు వచ్చాడు. ప్రస్తుతం చదువుతున్న కళాశాల నుంచి మార్చి మరో కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరాడు. నాలుగు నెలల్లో ఇంటర్‌ ముగుస్తుందని, మరో కళాశాల ఎందుకని తల్లిదండ్రులు కుమారుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మనస్తాపం చెందిన సాయికిరణ్‌ శుక్రవారం సాయంత్రం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి వేణుగోపాల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు. కాగా, నేడు సాయికిరణ్‌ పుట్టినరోజు ఉండగా ముందురోజున ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పుట్టినరోజు సందర్భంగా పాలకుర్తి మండలం వల్మిడి రామాలయానికి వెళ్లాలని నిర్ణయించుకున్న కుటుంబ సభ్యులు ఆ విషయాన్ని తలచుకుని రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇదిలా ఉండగా.. సాయికిరణ్‌ మృతికి కేవలం కళాశాల మార్పు విషయం మాత్రమే కాకుండా మరేమైనా కారణాలు ఉండొచ్చని స్థానికంగా చర్చించుకోవడం గమనార్హం.

సెమిస్టర్‌ పరీక్షల ఫలితాల విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల 2023-24 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల రెండో సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రమౌళి శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఎంఏ ఇంగ్లిష్‌, తెలుగు, ఎమ్మెస్సీ బాటనీ, మైక్రోబయాలజీ, జువాలజీలో కలిపి మొత్తంగా 150మంది పరీక్షలకు హాజరుకాగా 121మంది (80.66శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ కొలిపాక శ్రీనివాస్‌, డాక్టర్‌ రాజిరెడ్డి, డాక్టర్‌ సురేశ్‌బాబు, అరుణ ఉన్నారు.

ఇక తెలుగులోనే..

● విద్యుత్‌ సమాచారంపై టీజీఎన్పీడీసీఎల్‌ నిర్ణయం

● రైతులకు సులభంగా అర్థమయ్యేందుకు చర్యలు



టీజీ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయం



స్టేషన్‌ఘనపూర్‌ మండలం తాటికొండలో తక్కువ ఎత్తు కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ గద్దె వద్ద విద్యుత్‌ షాక్‌తో మృతి చెందిన పశువు (ఫైల్‌)

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారులు.. ప్రధానంగా రైతులకు విద్యుత్‌ సంబంధిత సమాచారం సులభంగా అర్థమయ్యేలా చేరవేయాలని టీజీ ఎన్పీడీసీఎల్‌ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని అన్ని సర్కిళ్లు, డివిజన్లు, సబ్‌ డివిజన్లకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంత రైతులకు ఇంగ్లిష్‌లో సమాచారం ఇస్తే విద్యుత్‌ అధికారుల నుంచి వచ్చిన సమాచారం వారికి అర్థమయ్యే పరిస్థితి ఉండదు. దీంతో ఇంగ్లిష్‌లో సమాచారం అందించడంపై రైతులు, రైతు సంఘాల నాయకుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రైతులు, గ్రామీణ ప్రాంత విద్యుత్‌ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోవడంతో ఎట్టకేలకు తెలుగులో సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్‌ఎంఎస్‌లు కూడా తెలుగులోనే పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్‌ మంజూరుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎస్టిమేట్‌, నక్ష తదితర సమాచారాన్ని ఇంగ్లిష్‌లో పంపేవారు. దీంతో ఏం అర్థం కాక రైతులు తలపట్టుకునేవారు. ఇంగ్లిష్‌ భాష తెలిసిన వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఇప్పటి నుంచి ఎస్టిమేషన్‌, నక్ష, మెటీరియల్‌ ఇతర సమాచారం అంతా తెలుగులోనే ఇవ్వాలని, ఎస్‌ఎంఎస్‌ కూడా తెలుగులోనే పంపాలని యాజమాన్యం సూచించింది. ఇలా ఇవ్వడం ద్వారా మెటీరియల్‌ వివరాలపై రైతులకు పూర్తి స్పష్టత ఉంటుంది. అదే విధంగా ఇప్పటి నుంచి విద్యుత్‌ కనెక్షన్‌కు అవసరమైన మెటీరియల్‌ను రైతులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఆ మెటీరియల్‌, పనులన్నీ సంబంధిత కాంట్రాక్టర్‌ సమకూర్చుకుని పనులు పూర్తి చేస్తారు. ఇటీవల వ్యవసాయ క్షేత్రాల్లో పశువులు విద్యుత్‌ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో విద్యుత్‌ ప్రమాదాలు నివారించేందుకు యాజమాన్యం జీరో విద్యుత్‌ ప్రమాదాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న అన్నింటిని సరి చేయనున్నారు.

రైతులకు అర్థమయ్యేలా..



రైతులకు సులభంగా అర్థమయ్యేలా ఇక నుంచి వివరాలన్ని తెలుగులో అందిస్తాం. రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులకు ఇబ్బందులుంటే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1912కు ఫోన్‌ చేయాలి.

\- వెంకటరమణ, ఎస్‌ఈ, హనుమకొండ

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాల నివారణకు ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం చర్యలు తీసుకుంది. ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాలు, విద్యుత్‌ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ గద్దెలు గుర్తించి, వాటిని సరిచేస్తాం.

\- మధుసూదన్‌ రావు, ఎస్‌ఈ వరంగల్‌

48కిలోల గంజాయి స్వాధీనం

● రైల్వే పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు

● వరంగల్‌ రైల్వే స్టేషన్‌లో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్‌

కాశిబుగ్గ: వరంగల్‌ రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకుని వారి నుంచి 48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ సీఐ సురేందర్‌ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బాబిత కుమారి పాణిగ్రాహి గుజరాత్‌ సూరత్‌లో ఉంటోంది. ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా దంగపదర్‌కు చెందిన సంజుక్త బెహరా లు గంజాయిని సూరత్‌కు తరలిస్తే డబ్బులు వస్తాయన్న ఆశతో ఇచ్చాపురం నుంచి అక్రమంగా సూరత్‌ తరలించేందుకు గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా గురువారం రెండు ప్లాస్టిక్‌ సంచులు, రెండు ప్లాస్టిక్‌ బుట్టలలో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌లో సూరత్‌కు బయలు దేరారు. ఈక్రమంలో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తుండగా వీరు వరంగల్‌ రైల్వే స్టేషన్‌లో దిగారు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం మరో రైలులో సూరత్‌ వెళ్లేందుకు వరంగల్‌ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై ఎదురుచూస్తున్నారు. అదేసమయంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల సమయంలో వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్దనున్న సంచులు, బుట్టలు పరిశీలించారు. దీంతో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో ఆర్పీఎఫ్‌ ఎస్సై వెంకటేశ్వర్ల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి ఇద్దరి మహిళలను రిమాండ్‌ తరలించామని తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.12,00,600 ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్‌ ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్‌ సారయ్య, గురువయ్య, రాజు, జీఆర్పీ ఎస్సై మోయినుద్దీన్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రాజు, నాగరాజు, ప్రశాంతి, సుమలత పాల్గొన్నారని సీఐ తెలిపారు.

కేయూకు నేడు వర్కింగ్‌ డే

● పరిపాలనాధికారులు, నాన్‌టీచింగ్‌ సిబ్బందికి మాత్రమే..

● అధ్యాపకులకు సెలవు యథాతథం

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీకి రెండో నేడు(శనివారం)వర్కింగ్‌ డేగా ప్రకటిస్తూ కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య పి.మల్లారెడ్డి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ నేపథ్యంలో అక్టోబర్‌ 10న యూనివర్సిటీకి సెలవు ప్రకటించిన విషయం విధితమే. ఆ రోజు సెలవుకు బదులుగా నేడు వర్కింగ్‌ డే గా ప్రకటించినట్లు రిజిస్ట్రార్‌ తెలిపారు. ఈ వర్కింగ్‌డే కేవలం పరిపాలనాధికారులకు, నాన్‌ టీచింగ్‌ సిబ్బందికి మాత్రమేనన్నారు. అధ్యాపకులకు సెలవు దినంగానే పరిగణిస్తామన్నారు. ఎందుకంటే అక్టోబర్‌ 10 అధ్యాపకులకు యూనివర్సిటీ అలుమనాక్‌ ప్రకారం సెలవు రోజే కాబట్టి వారికి నేడు వర్కింగ్‌ డే కాదని స్పష్టం చేశారు. పరిపాలనాధికారులు, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది 9న యథావిధిగా విధులకు హాజరుకావాలని రిజిస్ట్రార్‌ సూచించారు.

మలేషియా గడ్డపై పేరిణి నృత్యప్రదర్శన

● జనగామకు చెందిన పెరుమాండ్ల సంతోశ్‌కు ఆహ్వానం



మలేషియా చేరుకున్న పేరిణి నృత్యబృందం

జనగామ: తెలంగాణ అసోసియేషన్‌ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మలేషియాలో నేడు(శనివారం) జరుగనున్న పేరిణి నృత్య ప్రదర్శనకు జనగామ కళాకారుడికి ఆహ్వానం వచ్చింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జనగామ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన జనగామకు చెందిన పేరిణి నృత్య కళాకారుడు, మాస్టర్‌ పెరుమాండ్ల సంతోశ్‌ అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటుకోనున్నారు. మలేషియాలోని మాట్రేడ్‌ ఎగ్జిబిషన్‌ సెంటర్‌(ఎంఈసీసీ)లో నేడు ఈకార్యక్రమం జరుగనుంది. తెలంగాణ నుంచి పేరిణి నత్యం ప్రదర్శించేందుకు మాస్టర్‌ సంతోశ్‌కు ఉస్తాద్‌ బిస్మిల్లా ఖాన్‌ అవార్డు గ్రహీత, పేరిణి రాజ్‌ కుమార్‌ నుంచి ఆహ్వానం అందింది. దీంతో పేరిణి నృత్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే అవకాశం లభించినట్టైంది. జనగామ పట్టణంలో శ్రీచంద్ర కళానిలయం స్థాపించి, వందలాది మంది పిల్లలకు పేరిణి నృత్యాన్ని నేర్పిస్తున్నారు సంతోశ్‌. ఇతని వద్ద శిక్షణ పొందిన కళాకారులు తెలంగాణ, ఆంధ్రతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ మెప్పు పొందుతున్నారు.

అద్భుత అవకాశం



అంతర్జాతీయ వేదికపై పేరిణి నృత్యం చేసేందుకు అవకాశం లభించడం సంతోషంగా ఉంది. పేరిణికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషిచేస్తా. ఈ అవకాశం అందుకు దోహదపడుతుందని భావిస్తున్నా..

\- పెరుమాండ్ల సంతోశ్‌, శ్రీ చంద్ర కళానిలయం, పేరిణి మాస్టర్‌